ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 19 నవంబరు 2024



వేడెక్కిన రాజకీయం

● ఉదయనిధి, ఈపీఎస్ మధ్య వాగ్యుద్ధం




చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మధ్య వాగ్యుద్ధం తీవ్రరూపం దాల్చింది. నాలుగు రోజుల క్రితం సేలంలో ఈపీఎస్ మాట్లాడుతూ గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకాల పేర్లను మార్చి, వాటికి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేర్లు పెడుతున్నారంటూ ఆరోపించారు. ఆ విషయాన్ని ఆదివారం జరిగిన సామూహిక వివాహాల సభలో ఉదయనిధి ప్రస్తావిస్తూ ప్రభుత్వ పథకాలకు జీవిత పర్యంతం ప్రజాసేవకే పాటుపడిన కరుణానిధి పేరు పెడితే వచ్చే నష్టమేమిటని, కరుణ పేరుకు బదులుగా పదవి కోసం పాకులాడే ఈపీఎస్ పేరు పెట్టాలని అనుకుంటున్నారా అని ధ్వజమెత్తారు. ఈ విమర్శపై సేలంలో రైతు సంఘాల సన్మానసభలో పాల్గొన్న ఈపీఎస్ స్పందిస్తూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి నిన్న మొన్నటి వర్షాలకు పుటుకొచ్చిన పుట్టగొడుగులాంటి వాడని విమర్శించారు. దానికి ఉదయనిధి బదులిస్తూ పదవి కోసం పాక్కుంటూ వెళ్ళిన బొద్దింక లాంటి వ్యక్తి ఈపీఎస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కోట్లు సంపాదించే డీఎంకే నేతలపైనే ఐటీ, ఈడీ దాడులు జరుగుతాయని, న్యాయబద్ధంగా సంపాదిస్తున్న తనకు దాడులు జరుగుతాయనే భయమే లేదని ఈపీఎస్ పేర్కొన్నారు.

సంకీర్ణానికి అవకాశమే లేదు

డీపీఐ అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్



ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగబోయే ఎన్నికల తర్వాత సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యే పరిస్థితులు ఉండవని డీపీఐ అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్టీ అంతర్గత వ్యవహారాలను పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో వెల్లడించవద్దన్నారు. ప్రజల సమస్యల కోసం ఉద్యమించేలా కార్యకర్తలు వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు చేస్తామని డీఎంకే, అన్నాడీఎంకే చెబుతున్నాయని, అయితే, 2026 జరిగే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఇది సాధ్యమయ్యే అవకాశం లేదన్నారు. అధికారంలో భాగస్వామ్యం అంటూ ఇటీవల డీపీఐ గళమెత్తిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి చిన్న పార్టీలన్నీ ఇదే తరహాలో డిమాండ్ మొదలుపెట్టాయి. అయితే ఈ పార్టీలకు నేతృత్వం వహిస్తున్న డీఎంకే నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో తిరుమావళవన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

పన్నుల ఆదాయంలో చెరిసగం వాటా

● ఆర్థికసంఘం సభలో సీఎం స్టాలిన్



కేంద్ర ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ బంకారియాకు వినతి పత్రం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపేణా వచ్చే ఆదాయంలో 50 శాతాన్ని రాష్ట్రానికి కేటాయించాలని 16వ ఆర్థిక సంఘానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ ధర్మాసన చట్టం 280 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నడుమ నిధుల పంపిణీ సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఆర్థిక సంఘం ఏర్పాటైంది. ఈ ఆర్థిక సంఘం ప్రతి ఐదేళ్లకొకమారు రాష్ట్రాల్లో పర్యటించి రాబోవు ఐదేళ్లకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటికి కేటాయించాల్సిన నిధులకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. ఆ మేరకు 16వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ బంకారియాతో కూడిన 12 మంది బృందం నాలుగు రోజులపాటు పర్యటనకు ఆదివారం సాయంత్రం చెన్నై చేరుకున్నారు. రాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆర్థిక సంఘం సభ్యులందరికీ ప్రత్యేక విందు కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్థిక సంఘం బస చేసిన హోటల్‌లోనే సంఘం అధ్యక్షుడు అరవింద్ బంకారియా సహా సభ్యులు అజయ్ నారాయణన్‌షా, అనిజార్జ్ మాథ్యూ, మనోజ్ పాండా, సామియా కాండి ఘోష్, కార్యదర్శి రిత్విక్‌పాండే, డిప్యూటీ కార్యదర్శి రాహుల్ జైన్‌తో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఈవీ వేలు, తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, రాష్ట్ర ఆర్థిక సంఘం ముఖ్య కార్యదర్శి ఉదయచంద్రన్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ ఫెడరల్ రాజ్యాంగ విధానం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చుకునే నిధులు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులతోనే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, 15వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు పన్నుల రూపేణా వచ్చే ఆదాయంలో 41 శాతాన్ని కేటాయించాలని ప్రతిపాదించడం హర్షణీయమన్నారు. అయితే గత నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వం 33.16 శాతం మేరకే నిధులు విడుదల చేసిందని స్టాలిన్ తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే పన్నుల రూపేణా ఆదాయ వాటా క్రమం తగ్గుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే తమిళనాడు వంటి రాష్ట్రాలకు అవసరమైన నిధులను కేటాయించాలని, ఆ మేరకు ఆర్థిక సంఘం కేంద్రానికి సిఫారసు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆదాయ వనరులు కూడా తగ్గుముఖం పట్టాయన్నారు. రాష్ట్రం నుండి పన్నుల రూపేణా కేంద్రానికి భారీగా నిధులు సమకూరుతున్నప్పటికీ రాష్ట్ర అవసరాలకు తగినట్లు నిధులు కేంద్రం ఇవ్వడం లేదని కూడా ఆరోపించారు. రాష్ట్రంలో పట్టణాలు కనుమరుగై నగరాల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోందని, నగరాలుగా మారుతున్న ప్రాంతాల్లోని వారికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే కనుక ఈ విషయాన్ని కూడా ఆర్థిక సంఘం సభ్యులు గమనించి సరిపడ నిధులు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది కోట్ల మంది ఆశలు వమ్ముకాకుండా రాష్ట్రాభివృద్ధికి సరిపడా నిధులు అందేలా కేంద్ర 16వ ఆర్థిక సంఘం సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు.

అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకోం

● టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్



చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని, ఆ ఎన్నికల్లో పార్టీ సొంత బలంతోనే బరిలోకి దిగాలని భావిస్తోందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ స్పష్టం చేశారు. ఇటీవల విక్రవాండిలో జరిగిన పార్టీ తొలి మహానాడులో టీవీకే నేత విజయ్ మాట్లాడుతూ రాజకీయపరంగా తమ ప్రధాన శత్రువు డీఎంకే మాత్రమేనని ప్రకటించడమే కాకుండా భావసారూప్యత కలిగిన పార్టీలు తమ పార్టీతో పొత్తుపెట్టుకోవచ్చని, ఆ పార్టీలకు అధికారంలో భాగస్వామ్యం కూడా కల్పిస్తామన్న విషయం తెలిసిందే.

విజయ్ చేసిన ఈ ప్రకటన అన్నాడీఎంకే శ్రేణుల్లో ఆసక్తి రేపింది. అంతేగాక శాసనసభ ఎన్నికల్లో టీవీకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు పొడిచే అవకాశముందని అన్నివర్గాలు భావిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గత రెండు రోజులుగా ప్రసార మాధ్యమాల్లో అన్నాడీఎంకేతో టీవీకే పొత్తుపెట్టుకుంటుందని, 80 సీట్లలో పోటీ చేయనుందని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సోమవారం టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తన ఎక్స్ పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ విక్రవాండి మహానాడులో పార్టీ నేత విజయ్ ప్రకటించిన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. 2026 శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చే దిశగా అన్ని వ్యూహ రచన చేస్తున్నామని, ఆ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు కూడా సిద్ధమవుతున్నారని ఆయన తెలిపారు. 2026 శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల మద్దతు సంపూర్ణంగా పొంది, విజయం సాధించి టీవీకే అధికారంలోకి రావటం ఖాయమని, ఆ దిశగానే జిల్లా కార్యదర్శులు, ఇన్‌చార్జీలు, పార్టీ నేతలంతా కలిసి పార్టీ సిద్ధాంతాలపై ప్రచారం చేస్తున్నారనని తెలిపారు. కాగా అన్నాడీఎంకేతో టీవీకె పొత్తుకు సిద్ధమవుతోందంటూ ఎలాంటి ఆధారాలు లేని వార్తలను ప్రముఖ దినపత్రికలు ప్రచురించడం గర్హనీయమని బుస్సీ ఆనంద్ పేర్కొన్నారు. టీవీకే ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలోనే పెట్టుకునే తన రాజకీయ ప్రస్థానాన్ని, పయనాన్ని కొనసాగిస్తుందని, అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదన్నారు. పార్టీ అధ్యక్షుడు విజయ్ అనుమతితోనే తానీ ప్రకటన చేస్తున్నానని ఆయన తెలిపారు.

పండితులకు ఆర్థికసాయం



చేపాక్ కలైవానర్ అరంగంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తమ రచనలను జాతికి అంకితమిచ్చేందుకు అంగీకరించిన 9 మంది తమిళ పండితులకు తలా రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించిన సమాచార శాఖ మంత్రి సామినాథన్, ఆ శాఖ అధికారులు

మణిపూర్ సీజేగా జస్టిస్ డి.కృష్ణకుమార్

● సుప్రీం కొలీజియం సిఫారసు



జస్టిస్ డి.కృష్ణకుమార్

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ డి.కృష్ణకుమార్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. 2016 ఏప్రిల్ ఏడున ఆయన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ డి.కృష్ణకుమార్ హైకోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగానూ సేవలందించారు. వచ్చే యేడాది మే 21న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ని మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించేందుకు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి సిఫారసు చేసింది.

కస్తూరికి కంటిమీద కునుకే లేదు..!

● పుళల్ జైలులో సాధారణ ఖైదీలతోనే



అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివాదాస్ప వ్యాఖ్యల కేసులో పుళల్ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న నటి కస్తూరికి తొలిరోజు కంటిపై కునుకే కరువైందని జైలు వర్గాలు తెలిపాయి. ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు ఆమెను ఆదివారం మధ్యాహ్నం పుళల్ సెంట్రల్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. కొత్త ఖైదీలందరినీ ఒకే హాలులో ఉంచి వారి వివరాలను జైలు అధికారులు తీసుకుంటారు. ఆ తర్వాత జైలులో ప్రముఖులకు ఏ1 గదులు కేటాయిస్తుంటారు. సినీ నటి కస్తూరికి ఆ తరహా గది కేటాయించలేదు. అయితే, ఆమె కోర్టుకు విన్నవించుకుని ఏ1 గది పొందే అవకాశం ఉంది. అప్పటి వరకు సాధారణ మహిళా ఖైదీలతోనే గడపాల్సి ఉంటుంది. ఆదివారం రాత్రి సాధారణ ఖైదీలతో గడిపిన కస్తూరిని, సోమవారం తక్కువమంది మహిళా ఖైదీలున్న గదికి మార్చారు. జైలులో దోమలు బెడద ఎక్కువగా ఉండటం, సాధారణ మహిళా ఖైదీలతో కలిసి వుండాల్సి రావడంతో ఆమె బాగా ఇబ్బంది పడినట్లు తెలిసింది.

రేపు బెయిల్ పిటిషన్‌పై విచారణ

నటి కస్తూరి బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె తరపు న్యాయవాది ప్రభాకర్ సోమవారం ఎగ్మోర్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని న్యాయవాది వెల్లడించారు.

డెల్టా జిల్లాల్లో భారీ వర్షం

● స్తంభించిన జనజీవనం



జలమయమైన తంజావూరు బస్‌స్టేషన్ ప్రాంతం

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం తదితర డెల్టా జిల్లాల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు ప్రవహించింది. దీంతో తంజావూరు జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తంజావూరు జిల్లాలోని తిరువయ్యారు, బూతలూరు, ఒరత్తనాడు, పాపనాశం, తిరువిడైమరుదూరు, పేరావూర్ని, పట్టుకోట, కుంభకోణం తదితర ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. ఇదే విధంగా తిరువారూరు జిల్లా నన్నిలం, కూత్తానల్లూరు, వడపాదిమంగళం, మాంగుడి, వడక్కై, తిరుత్తురైపూండి, పులివలం తదితర ప్రాంతాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. నాగపట్టినం జిల్లా వేదారణ్యం, ఆరుకాట్టుతురై, పుష్పవనం, వెళ్లపల్లం, కోడియక్కరై, వాయ్‌మేడు, ఆయకారన్‌పులం, కరుంబులం తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షాలు కురిశాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఆదివారం అర్ధరాత్రి ఆ జిల్లా కలెక్టర్ ఆకాష్ వర్షబాధిత ప్రాంతాలను సందర్శించి వర్షబాధితులకు సహాయక చర్యలు చేపట్టారు.



వాన కురిసినా తప్పని బతుకు పోరాటం



నాగపట్టినంలో వర్షబాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆకాష్

నేడు 15 జిల్లాలకు వర్షసూచన

ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చడంతో డెల్టా, కోస్తాతీర జిల్లాల సహా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో మరో రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నుంగంబాక్కంలోని ప్రాంతీయ వాతావరణ పరిశోధనా కేంద్రం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాల్దీవులు, హిందూ మహాసముద్ర తీర ప్రాంతాల నుంచి అరేబియా సముద్ర తీర ప్రాంతాల వరకు అల్పపీడనం పయనిస్తుందని, దీని ప్రభావం కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి కడలూరు, మైలాడుదురై, తిరువారూర్, తంజావూరు, నాగపట్టణం, పుదుక్కోట, శివగంగై, రామనాథపురం, మదురై, తేని, విరుదునగర్, తెన్‌కాశి, తూత్తుక్కుడి, తిరునెల్వేలి, కన్నియాకుమారి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేసింది.

విద్యార్థులతో సొంతపనులా?

● చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఉన్నత విద్యాశాఖ

ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా కోర్సు చేస్తున్న విద్యార్థులు (స్కాలర్స్)తో సొంత పనులు చేయించుకోకూడదని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి గోపాల్ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లకు ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా విద్యార్థుల పట్ల గౌరవప్రదంగా నడుచుకోవాలని సూచించారు. విద్యా సంబంధమైనవి మినహా ఇంటి పనులు చేయాలని ఇబ్బందులకు గురి చేయరాదని, దీనిని ఉల్లంఘించే వారిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రొఫెసర్లు, విశ్వవిద్యాలయాలు వ్యవహరించాల్సిన తీరుపై ఉన్నత విద్యాశాఖ రూపొందించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని గోపాల్ స్పష్టం చేశారు.

సమాచార దర్శిని

చెన్నైలో నేడు టీడీపీ సభ్యత్వ నమోదు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో నివాసముంటున్న అభిమానులు, తెలుగువారి కోసం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరుగనుంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సూచనలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తెలుగువారంతా హాజరై విజయవంతం చేయాలని చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.అన్నానగర్ టవర్ క్లబ్ మీటింగ్ హాలులో సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానున్న ఈకార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సీనియర్ నేతలుహాజరుకానున్నారు.

21న 'స్వర్ణామృతప్రాసన'

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాశ్యప మహర్షి సూత్రీకరించబడిన 'స్వర్ణామృతప్రాసన' పంపిణీ ఈ నెల 21న జరుగనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చెన్నై నిర్వాహకులు ప్రకటించారు. 16 ఏళ్ల వయసు వరకు ప్రతి నెలా పుష్యమి నక్షత్రం రోజున ఆరు నెలల పాటు ఈ ఔషధం తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని, పిల్లల్లో చురుకుదనం, జీర్ణవ్యవస్థ, జ్ఞాపకశక్తి పెరుగుతాయని, మనసును ప్రశాంత పరుస్తుందని ప్రకటనలో పేర్కొన్నారు. 21వ తేదీ టి.నగర్ తనికాచలచెట్టి రోడ్డులో వున్న 'డాక్టర్ అనంత్స్ హోమియో క్లినిక్'లో ఈ ఔషధం పంపిణీ చేయబడుతుంది. వివరాలకు 9840240002, 9884526116 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

నటి రోహిణిపై కేసు నమోదు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నగరంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు.. రాస్తారోకో కూడా చేసిన నటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సమస్యల పరిష్కారం ఇటీవల సీపీఎం నేతృత్వంలో అన్నాసాలై నుంచి మెరీనాలోని శ్రామికుల విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. అయితే అనుమతి లేదంటూ పోలీసులు ఆ ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన రోహిణి, సీపీఎం కార్మిక నేత సౌందరరాజన్, సెంట్రల్ చెన్నై కార్యదర్శి జి.సెల్వ తదితరులు ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

హిజ్రాకు లైంగిక వేదింపులు

● కానిస్టేబుల్‌పై వేటు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిజ్రాపై లైంగిక వేదింపులకు పాల్పడిన కానిస్టేబుల్‌ను తంజావూరు జిల్లా ఎస్పీ ఆశిష్ రావత్ డిస్మిస్ చేశారు. తంజావూరు సమీపంలో పల్లి అగ్రహారానికి చెందిన వినోద్ (38) ఐఎం పేట్టై పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన హిజ్రా ఇంట్లోకి వెళ్లి, లైంగిక వేదింపులకు పాల్పడ్డాడు. ఆ హిజ్రా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటన 2023 ఆగస్టులో జరగ్గా.. ఇటీవల అతను తిరువనం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. ఈలోపు శాఖాపరమైన విచారణ పూర్తవడంతో హిజ్రాపై వినోద్ లైంగిక వేదింపులకు పాల్పడినట్లు తేలడంతో అతన్ని డిస్మిస్ చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ప్రకటించారు.

తిరునాగేశ్వరానికి సింగపూర్ మంత్రి

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ హోం మంత్రి షణ్ముగం కుంభకోణంలోని తిరునాగేశ్వరానికి వెళ్లి రాహు ఆలయంలో పూజలు చేశారు. ఆయన తిరుచ్చి ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టరులో కుంభకోణం వచ్చారు. అక్కడ నుంచి కారులో తిరునాగేశ్వరానికి వెళ్లి ఆలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత అయ్యావాడిలో ఉన్న ప్రత్యాంగర దేవి ఆలయంలో కూడా ఆయన పూజలు చేశారు. ఆ సమయంలో రాష్ట్ర మంత్రి షణ్ముగం రాగా, ఆయనతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం హెలికాప్టరులో మైలాడుదురై వెళ్లారు.

డిసెంబరు 20లోగా ప్లస్ టూ పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పబ్లిక్ పరీక్ష ఫీజును విద్యార్థుల నుంచి వసూలు చేసి ఆన్‌లైన్ ద్వారా డిసెంబరు 20వ తేదిలోగా చెల్లించాలని మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు మహోన్నత విద్య అధికారులకు ప్రభుత్వ పరీక్షల బోర్డు సోమవారం ఓ సర్క్యులర్ జారీ చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల నుంచి పరీక్షా ఫీజు డిసెంబరు 10వ తేదిలోగా వసూలుచేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రాక్టికల్ పాఠ్యాంశం కలిగిన విద్యార్థులకు రూ.225, ప్రాక్టికల్ పాఠ్యాంశాలు లేని విద్యార్థులకు రూ.175 ఫీజుగా నిర్ణయించింది. అందులో, తమిళ మీడియంలో పరీక్షలు రాసే అన్ని పాఠశాలల విద్యార్థులకు పరీక్షా ఫీజు నుంచి మినహాయింపు కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ వర్గాల విద్యార్థులు, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు మించని విద్యార్థులకు పరీక్షా ఫీజు నుంచి మినహాయింపు కల్పించారు. ఇక, ప్లస్ వన్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందని పాఠ్యాంశాలకు సంబంధించిన పరీక్షా ఫీజు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 20వ తేది నుంచి చెల్లించవచ్చు. ఒక పాఠ్యాంశానికి రూ.50, సర్వీస్ ఫీజు రూ.35 చెల్లించాల్సి ఉంటుంది. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల ఫలితాలతో కూడిన మార్కుల జాబితాను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనేందుకు అన్ని పాఠశాలలు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది.

జనసమీకరణకు అన్నాడీఎంకే కొత్త చిట్కా!

● సభలో కూర్చునే కుర్చీలు ఉచితం

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా పెరుమానల్లూరులో అన్నాడీఎంకే స్థానిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన బహిరంగ సభకు విచ్చేసిన జనాన్ని చూసి స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. ఇంత మందిని సభకు ఎలా తరలించారబ్బా? అని గుసగుసలాడుకున్నారు. ఆ తర్వాత అక్కడే ఉన్న పార్టీ స్థానిక నాయకుడొకరిని ఆ విషయమై ప్రశ్నించగా జనాన్ని రప్పించడానికి ఓ చిట్కా ప్రకటించినట్లు తెలిపారు. అది విన్న స్థానికులు విస్తుపోయారు. ఇంతకీ ఆ చిట్కా ఏమిటంటే పెరుమానల్లూరు అంతటా ఆదివారం ఉదయం అన్నాడీఎంకే నేతలు మైకులో ప్రచారం చేస్తూ ఓ ప్రకటన చేశారు. పార్టీ సమావేశానికి వచ్చేవారికి సభలో కూర్చునే ప్లాస్టిక్ కుర్చీ సమావేశం అయ్యాక ఇంటికి తీసుకెళ్లవచ్చని ప్రకటించారు. అది విన్న స్థానికులంతా సమావేశం జరగటానికి గంట ముందే వందల సంఖ్యలో వెళ్లారు. పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చున్నారు. ఇక వేదికపై అన్నాడీఎంకే నాయకులంతా డీఎంకే పాలనపై విమర్శలు చేశారు. హాజరైన జనం ఆ నాయకుల ప్రసంగాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఎప్పుడు సభ ముగుస్తుందా, ప్లాస్టిక్ కుర్చీ ఇంటికి తీసుకెళదామా అనేఆలోచనలోనే మునిగిపోయారు. సమావేశం ముగిసిన వెంటనే సభకు హాజరైన జనమంతా తలా ఒక కుర్చీ పట్టుకుని ఇళ్లకు పరుగెత్తారు. అన్నాడీఎంకే సభలకు జనాన్ని తరలించేందుకు ప్లాస్టిక్ కుర్చీలను ఉచితంగా ఇవ్వటం బాగుందంటూ స్థానిక నాయకులు సభా నిర్వాహకులను మెచ్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తిరుప్పూరు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందినవారంతా ఈ తీరులోనే తమ ఊళ్లలో అన్నాడీఎంకే నేతలు ఎప్పుడు సమావేశాలు జరుపుతారా అని ఎదురు చూస్తున్నారు.



సభ ముగియగానే కుర్చీలను తీసుకెళ్తున్న జనం

అజ్ఞాతంలోకి వెళ్ళలేదు ఇంట్లోనే ఉన్నాను: నటి కస్తూరి

● అరెస్టుకు ముందు వీడియో రిలీజ్

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాను అజ్ఞాతంలోకి వెళ్లినట్టు, పారిపోయినట్టుగా జరిగిన ప్రచారాన్ని సినీ నటి కస్తూరి ఖండించారు. అమెను హైదరాబాద్‌లో చెన్నై పోలీసులు అరెస్టు చేయడానికి ముందే ఒక వీడియో రికార్డు చేసి దాన్ని విడుదల చేయగా, ఈ వీడియో ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ వీడియోలో 'నేను అజ్ఞాతంలోకి వెళ్లలేదు. ఎక్కడికీ పారిపోలేదు. హైదరాబాద్‌లోని నా ఇంటిలోనే ఉన్నాను. షూటింగు కోసం ఇక్కడకు వచ్చాను. ప్రతి రోజూ షూటింగుకు వెళ్ళి మళ్ళీ ఇంటికి వస్తున్నాను. శనివారం కూడా షూటింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన తర్వాతే నన్ను చెన్నై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నా మొబైల్ ఫోన్ న్యాయవాది దగ్గర ఉంది. ఏ తప్పూ చేయలేదు. ఎవరికీ భయపడను' అని పేర్కొన్నారు.

క్రికెట్‌లో తిరుత్తణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీనివాసన్, కేశవన్

తిరుత్తణి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి '50 బాల్స్' సబ్ జూనియర్ క్రికెట్ పోటీల్లో తిరుత్తణి విద్యార్థులు ప్రతిభ చూపారు. పంజాబ్ రాష్ట్రం చండీఘడ్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో 16 రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి ప్రాంతానికి చెందిన జట్టు ఐదో స్థానంలో నిలిచింది. విద్యార్థులను తమిళనాడు 50 బాల్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసన్, కోచ్ కేశవన్ సహా పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఉత్తమ సైన్స్ టీచర్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సైన్స్ టీచర్ పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి కలిగించడం, సైన్స్‌లో వారు రాణించేలా చేయడం, ఉన్నత విద్యలో సైన్స్ పాఠ్యాంశం తీసుకొనేలా మార్గదర్శకం చేస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించేలా 2018 నుంచి ఈ పురస్కారాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఆ ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరానికి గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ సహా 10 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. ఉన్నత, మహోన్నత ప్రభుత్వ పాఠశాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సైన్స్ టీచర్లు తమ పాఠశాల హెచ్ఎం, ఆయా జిల్లాల ప్రధాన విద్యాశాఖ కార్యాలయాల సిఫారసు లేఖతో డిసెంబరు 23వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమర్పణ, ఇతర వివరాలకు www.sciencecitychennai.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

తాంబరం నుంచి నాగర్‌కోయిల్, సెంగోట్టై రైళ్లు

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరాల్సిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు తాంబరం నుంచి బయల్దేరనున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే సోమవారం ప్రకటన విడుదల చేసింది.

- నెం.12667 చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21వ తేది రాత్రి 7.30 గంటలకు తాంబరం నుంచి బయల్దేరుతుంది. మరుమార్గంలో నెం.12668 నాగర్‌కోయిల్-చెన్నై ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైలు 22వ తేది తెల్లవారుజామున 4.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- నెం.20681 చెన్నై ఎగ్మూర్-సెంగోట్టై ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20వ తేది నుంచి రాత్రి 8.55 గంటలకు తాంబరం నుంచి బయల్దేరుతుంది. మరుమార్గంలో నెం.20682 సెంగోట్టై-చెన్నై ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 21వ తేది నుంచి తెల్లవారుజామున 4.25 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- నెం.22663 చెన్నై ఎగ్మూర్-జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23వ తేది నుంచి మధ్యాహ్నం 2.50 గంటలకు తాంబరం నుంచి బయల్దేరుతుంది. మరుమార్గంలో నెం.22664 జోధ్‌పూర్- ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.10 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరలా ఉత్తర్వులు వెలవడే వరకు ఈ రైళ్ల మార్పులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

రవాణా సంస్థ బస్సుల్లో రిజర్వేషన్ గడువు 90 రోజులకు పెంపు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నగరాలకు, దూర ప్రాంతాలకు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసు ల్లో ఆన్‌లైన్ టికెట్ల రిజర్వేషన్ల గడువును 90 రోజులకు పెంచినట్లు ఆ సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. పండుగ సమయాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టికెట్లు లభించక ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటారు. వాటిని తొలగించే దిశగా రవాణా సంస్థ ఆన్‌లైన్‌లో 60 రోజులకు ముందే టికెట్లను రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ప్రయాణించేందుకు ఆన్‌లైన్ ద్వారా టికెట్ రిజర్వేషన్ గడువును 90 రోజులకు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ కొత్త సదుపాయం సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి అమలులోకి వచ్చిందని తెలిపారు.

చంద్రబాబుకు పరామర్శ



చంద్రబాబుతో చంద్రశేఖర్

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పరామర్శించారు. చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి చెందిన నేపథ్యంలో సోమవారం తిరుపతి జిల్లా నారావారిపల్లెకు వెళ్లిన చంద్రశేఖర్ ఆ కుటుంబాన్ని పరామర్శించి, చంద్రబాబు, నారా రోహిత్ కుటుంబీకులను కలుసుకుని సంతాపం, సానుభూతి తెలిపారు.

వేద నీట్ అకాడమీ ప్రారంభం



నీట్ అకాడమీని ప్రారంభిస్తున్న వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినాథపురం ఆరణి రోడ్డులో వేద నీట్ అకాడమీ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వీఐటీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం, వేలూరు కృష్ణస్వామి మొదలియార్ పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ దొరైరాజ్ పాల్గొన్నారు. ట్రాన్స్‌పోర్ట్ యజమాని శివకుమార్, వేలూరు కన్నా రెసిడెన్సీ అధినేత భామినాథన్ తదితరులు అకాడమీని ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమీ స్థాపకులు జగదీశ్వరన్, రాజ్యలక్ష్మి, చంద్రశేఖరన్, వెంకటేశన్, తులసి వెంకటేశన్, కార్తికేయన్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల్లో దిండుగల్ జిల్లాదే అగ్రస్థానం

ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాల్యవివాహాలు అధికంగా జరిగే జిల్లాగా దిండుగల్ జిల్లా అగ్రస్థానంలో ఉందని సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది. రాష్ట్రంలో గత ఏడాది మాత్రమే 1,995 బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు, 3,049 కేసులు నమోదు చేశారు. దేశంలో 21 ఏళ్లు నిండని యువకులు, 18 ఏళ్లు పూర్తికాని యువతులకు వివాహం చేయరాదన్న చట్టం అమలులో ఉంది. అయినప్పటికీ, కుటుంబ పరిస్థితుల కారణంగా కొందరు తల్లిదండ్రులు బాల్యవివాహాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఈ వివాహాలను అడ్డుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేపట్టింది. రాష్ట్రంలో బాల్యవివాహాలకు సంబంధించి కేసులు నమోదు చేయడంలో దిండుగల్ జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఆ జిల్లాలో గత ఏడాది 175 కేసులు నమోదయ్యాయి. రెండో స్థానంలో ఉన్న నామక్కల్ జిల్లాలో 171 కేసులున్నాయి. తృతీయ స్థానంలో ఉన్న తేని జిల్లాలో 161 కేసులు, కడలూరు జిల్లాలో 150 కేసులు, సేలంలో 143 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా, బాల్య వివాహం చేసుకోవడం వల్ల సంబంధిత బాలికల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని, బాల్యవివాహం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని, దీనిపై విస్తృతంగా అవగాహన ప్రచారం అవసరమని ప్రభుత్వ అధికారులు తెలిపారు.

బస్సు బోల్తా: అయ్యప్ప భక్తులకు గాయాలు

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని ఎరుమేలి అనే ప్రాంతంలో బస్సు బోల్తాపడిన ఘటనలో నామక్కల్ జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తులు గాయపడ్డారు. వీరిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నామక్కల్ జిల్లాకు చెందిన 30 మంది భక్తులు మినీ బస్సులో ఆదివారం శబరిమల యాత్రకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు కేరళ రాష్ట్రంలోని ఎరుమేలి కొండ మార్గంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు అయ్యప్ప భక్తులు గాయపడగా, మిగిలినవారు క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఒకేరోజు 8 అంతర్జాతీయ విమానాల రద్దు

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి సోమవారం బయల్దేరాల్సిన 8 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. సింగపూర్, శ్రీలంక, ఢాకా వెళ్లే 4 విమానాలు, ఆ దేశాల నుంచి నగరానికి రావాల్సిన మరో 4 విమానాలు మొత్తం 8 సర్వీసులు రద్దయ్యాయి. నిర్వహణ కారణాలతో విమాన సర్వీసులు రద్దయ్యాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

సిల్వర్, ప్లాస్టిక్ కవర్లలో పార్శిళ్లు నిషేధం

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిల్వర్ పేపర్లు, ప్లాస్టిక్ కవర్లలో భోజనం, టిఫిన్ తదితరాలు ఇవ్వొద్దని ఆహార భద్రతా శాఖ తెలిపింది. నిబంధనలు అతిక్రమించి వీటిని వినియోగించే హోటళ్లకు సీలు వేయడంతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఈ వ్యవహారంపై ఏర్పాటైన ప్రత్యేక బృందాలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపడతాయని అధికారులు తెలిపారు.

రూ.1.21 కోట్ల మోసం

● బీజేపీ నేత అరెస్టు

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా విరుదాచలంలో న్యాయవాది, ఆయన తండ్రి వద్ద రూ.1.21 కోట్ల మేర మోసం చేసిన కేసులో స్థానిక బీజేపీ నేతను పోలీసులు అరెస్టు చేశారు. విరుదాచలం వయలూరు ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు రాజ్ కుమార్‌కు పెట్రోల్ బంకు ఉంది. ఈ నేపథ్యంలో విరుదాచలంలోని ఒక స్థలాన్ని పుదుకుప్పంకు చెందిన భాస్కరన్ అనే వ్యక్తి న్యాయవాదికి కొనుగోలు చేసిపెడతామని రాజ్‌కుమార్ నమ్మించగా, ఇందుకోసం రూ.44 లక్షలు అడ్వాన్స్‌గా భాస్కర్ ఇచ్చారు. ఆ తర్వాత తన పెట్రోల్ బంకు విస్తరణ కోసం మరో రూ.30 లక్షలను రాజ్‌కుమార్ తీసుకున్నాడు. ఆ తర్వాత స్థలాన్ని భాస్కరన్ పేరున రిజిస్టర్ చేయకుండా, మరో వ్యక్తికి రూ.65 లక్షలకు రిజిస్టర్ చేశాడు. అలాగే, భాస్కర్ తండ్రి బాలకుమార్ వద్ద కూడా మరో రూ.47 లక్షలకు మోసం చేశాడు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజ్‌కుమార్‌ను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచి కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

యువతిపై లైంగిక వేదింపులు గాయకుడు గురుగుహన్ అరెస్టు



గురుగుహన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరంగిమలైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యువతిపై లైంగిక వేదింపులకు పాల్పడ్డారనే నేరారోపణపై హిప్పీ స్ట్రీట్ వేడుకల్లో పాల్గొనే ప్రముఖ గాయకుడు గురుగుహన్‌ను పోలీసులు అరెస్టుచేశారు. తనను పెళ్ళిచేసుకుంటానని నమ్మించి, చివరకు కులం సాకుతో పెళ్లికి నిరాకరించి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఆ యువతి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆ మేరకు పరంగిమలై పోలీసులు కేసు నమోదు చేసి గురుగుహన్‌ను అరెస్టు చేశారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విరాళిమలైలో చెట్టు కింద నిల్చున్న మహిళ పిడుగుపాటుకు గురై మృతిచెందింది. పుదుకోట జిల్లా విరాళిమలై సమీపం విలాపట్టికి చెందిన జంబులింగం భార్య భాగ్యం (49) ఆదివారం పశువులను తీసుకొని సమీపంలోని పొలాలకు వెళ్లింది. ఆ సమయంలో, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో, ఆమె సమీపంలోని చింతచెట్టు కిందకు వెళ్లింది. చెట్టు సమీపంలో పిడుగు పడి షాక్‌కు గురైన భాగ్యం ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై ఇలుప్పూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుచ్చిలో సిద్ధవైద్యకళాశాల

● మంత్రి నెహ్రూ

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో సిద్ధ వైద్యశాల, దంత వైద్యశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరామని, అందుకాయన సానుకూలంగా స్పందించారని పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. తిరుచ్చి మహాత్మాగాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.1.62 కోట్లతో పునరుద్ధరించబడిన లిఫ్ట్, వైరస్ పరిశోధనా కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. అంతేగాక ఇదే ప్రాంగణంలో రూ.110 కోట్లతో అధునాతన వసతులతో నిర్మితమవుతున్న నూతన భవనాన్ని కూడా మంత్రి పరిశీలించారు. ఆస్పత్రి వెలుపలపోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుచ్చిలో వైద్య కళాశాల, నూతన దంతవైద్య కళాశాల ఏర్పాటుకు సంబంధించి, త్వరలో శుభవార్త వస్తుందన్నారు.

ఆస్పత్రిలో ప్రాంక్ వీడియో

● యువకుడి అరెస్టు

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాంక్ వీడియో తీసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చేయి విరిగినట్టుగా కట్టు కట్టుకుని ఆస్పత్రికి వచ్చిన ఒక యువకుడు యాక్ట్ చేయగా, మరో యువకుడు వీడియో చిత్రీకరించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఆ యువకులను పీర్ మహ్మద్, షేక్ మహ్మద్‌గా గుర్తించి అరెస్టు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

హిందూ మక్కల్ కట్చి ఆందోళన



ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందూ మక్కల్ కట్చి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఓంకార బాలిని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ నగరంలో ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. వాలాజా బస్టాండ్ వద్ద జరిగిన ఆందోళనకు ఈ సంఘం కోట అధ్యక్షుడు మోహన్ అధ్యక్షత వహించారు. ఆందోళనలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

'నరువి'లో రేడియేషన్ విద్యపై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న నరువి ఆస్పత్రి అధ్యక్షుడు జీవీ సంపత్

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రేడియేషన్ వైద్య శాఖ, ఇమేజింగ్ సంఘం తరఫున నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం సదస్సు నిర్వహించారు. తమిళనాడు, పుదుచ్చేరి సంఘాల సభ్యులు పాల్గొన్న ఈ సదస్సును నరువి ఆస్పత్రి అధ్యక్షుడు జీవీ సంపత్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సదస్సుకు రెండు రాష్ట్రాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ చిన్నదొరై అబ్దుల్లా అధ్యక్షత వహించారు. ఇండియన్ రేడియేషన్ వైద్యశాఖ, ఇమేజింగ్ సంఘం వేలూరు శాఖ అధ్యక్షుడు డా.మదన్‌మోహన్ ఆహ్వానం పలికారు. సదస్సులో రేడియేషన్ వైద్య చట్టాలు, సమస్యలు, పరిష్కారాలు, స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు, బ్యాంక్ రుణాలు సహా పలు అంశాలపై చర్చించారు.

బాలికపై అత్యాచారం: దర్యాప్తునకు ప్రత్యేక కమిటి

● బాధితురాలి తల్లికి రూ.75 వేల నష్టపరిహారం

● సుప్రీంకోర్టు ఆదేశం

ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని ఓ ప్రాంతంలో అత్యాచారానికి గురైన పదేళ్ల బాలిక తల్లికి నష్టపరిహారంగా రూ.75 వేలు చెల్లించడంతో పాటు దర్యాప్తునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. ఇటీవల చిన్నారిపై జరిగిన అత్యాచారంపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఇదిలావుండగా, చిన్నారి, ఆమె కుటుంబ సభ్యులను పోలీసులు అవమానించేలా మాట్లాడటంతో పాటు బాధితులపై దాడికి పాల్పడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటి ఆధారంగా మద్రాస్ హైకోర్టు సుమోటోగా ముందుకు వచ్చి అత్యాచార కేసును విచారణకు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఈ కేసు సీబీఐకి బదిలీ అయింది. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ చెన్నై పోలీస్ విభాగం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం బాధితుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తూ, బాధితురాలి తల్లికి రూ.75 వేల పరిహారం ఇవ్వాలని, అలాగే, ఈ కేసు విచారణకు సీబీఐ అవసరం లేదంటూ, ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

కోవై ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ శ్రేణుల ఘర్షణ

● వీడియో వైరల్

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు విమానాశ్రయంలో కాంగ్రెస్ నేతల మధ్య తగాదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కేరళలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని తిరిగి ఢిల్లీ వెళ్లేందుకు కోవై ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు వీడ్కోలు పలికేందుకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మయూర జయకుమార్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కోవై సెల్వన్ సారథ్యంలోని శ్రేణులు కేసీ వేణుగోపాల్‌కు వీడ్కోలు పలికి ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వెళ్ళే క్రమంలో రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అయితే, ఈ దాడిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

జీహెచ్ వద్ద మెటల్ డిటెక్టర్లు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్‌పై రోగి సహాయకుడు కత్తితో దాడి జరిపిన సంఘటన నేపథ్యంలో నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద సీసీ కెమెరాలు, మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ మేరకు సెంట్రల్ స్టేషన్ సమీపంలోని రాజీవ్‌గాంధీ సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్) వద్ద గత రెండు రోజులుగా మెటల్ డిటెక్టర్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ విషయమై ఆ ఆసుపత్రి డీన్ దెరని రాజన్ మాట్లాడుతూ జీహెచ్‌కు రోజూ 12 వేల మంది దాకా ఔట్‌పేషంట్లు వస్తుంటారని, అదే సమయంలో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారి సహాయకులు కూడా వస్తుంటారని, వీరందరినీ మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసిన మీదటే లోపలకు అనుమతించనున్నట్లు తెలిపారు.

దళవాయి సుందరానికి మళ్లీ పదవి

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అన్నాడీఎంకే నుంచి సస్పెండయిన దళవాయి సుందరానికి పదవి దక్కింది. కొద్దిరోజుల క్రితం ఆర్ఎస్ఎస్ ర్యాలీని దళవాయి సుందరం ప్రారంభించడంతో మరుసటిరోజే ఆయన్ని కన్నియాకుమారి తూర్పు జిల్లా కార్యదర్శి, వ్యవస్థాపక కార్యదర్శి తదితర పదవుల నుంచి తొలగిస్తున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో, 40 రోజుల అనంతరం దళవాయి సుందరం ఇచ్చిన సంజాయిషీ లేఖను పరిశీలించి మళ్లీ ఆ రెండు పదవుల్లో ఆయన కొనసాగుతారని పళనిస్వామి సోమవారం ప్రకటన విడుదల చేశారు.

గ్రీవెన్స్‌లో 360 వినతులు

వేలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ జరిగింది. కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, ప్రజల నుంచి 360 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలను విచారించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వేలూరు రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెందిల్‌కుమార్, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

రేస్‌కోర్స్ మైదానం గుంతల్లో జలకళ

పెరంబూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని రేస్‌కోర్సు మైదానంలో తవ్విన రెండు గుంతల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. 1945లో లీజు ప్రాతిపదికన 160 ఎకరాల్లో రేస్‌కోర్స్ ఏర్పాటైంది. కానీ, 1970 నుంచి లీజు అద్దె చెల్లించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రేస్ కోర్స్ నిర్వాహకులకు నోటీసులిచ్చింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ విచారించిన న్యాయస్థానం, అద్దె బకాయి చెల్లించకుంటే స్థలం స్వాధీనం చేసుకోవచ్చని ఉత్తర్వులిచ్చింది. రేస్ కోర్స్ నిర్వాహకులు అప్పీలు చేసిన నేపథ్యంలో సెప్టెంబరులో లీజు ఒప్పందం రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం స్థలం స్వాధీనం చేసుకొని, రేస్ క్లబ్‌కు సీలు వేసింది. ఈ మైదానంలో వర్షపు నీరు సంరక్షించేలా ఎలాంటి వసతులు లేదు. దీంతో గత ఏడాది కురిసిన భారీవర్షాలకు రేస్‌కోర్స్ ప్రాంగణం నుంచి భారీగా వచ్చిన వరద నీటి కారణంగా ఐదు ఫర్లాంగ్ రోడ్డులోని నిర్మాణంలో ఉన్న గుంతలో మట్టి చెరియలు విరిగిపడి ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనతో అప్పట్లో రేస్‌కోర్స్ నిర్వాహకులకు కార్పొరేషన్ రూ. లక్ష జరిమానా విధించింది. ఈ క్రమంలో, 160 ఎకరాలు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం, అందులో గుంతలు తవ్వి వాననీటి సంరక్షణ చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం, 160 ఎకరాల్లో, 118 ఎకరాలు మైదానం ఉంది. అందులోని 5 ఎకరాల్లో తలా 1.25 ఎకరాల విస్తీర్ణంలో 16 నుంచి 20 అడుగుల లోతున నాలుగు గుంతలు తవ్వుతున్నారు.. తొలివిడతగా రూ.80 లక్షలతో గుంతలు తవ్వకాలు ప్రారంభించారు. భారీవర్షసూచన ప్రకటిస్తే, ముందుగానే గుంతల్లోని నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతామని, అందువల్ల రేస్ కోర్స్ చుట్టుపక్కల ఉన్న గిండి, వేళచ్చేరి తదితర ప్రాంతాలకు వరద నష్టం ఉండదని అధికారులు తెలిపారు.



గుంతల్లో చేరిన నీరు

చిత్రజ్యోతి



చిత్రసీమకు బాలనటిగా పరిచయమై హీరోయిన్‌గా రాణిస్తున్న యువనటి ప్రీతి అస్రానీ. టీవీ సీరియల్స్, తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో నటించారు. 'అయోధ్య' చిత్రంలో నటించి ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం తమిళం, తెలుగు భాషల్లో బిజీగా ఉన్న ఈ యువనటి కవిన్‌తో కలిసి నటించిన 'కిస్' మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా ప్రీతి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూ ...

రజనీ ప్రశంస ఓ మధుర జ్ఞాపకం

● ప్రీతి అస్రానీ

?మీ ఫ్యామిలీ నేపథ్యం

! తండ్రి పేరు శ్యామ కుమార్. అమ్మ కిషోరీ దేవి. అక్క అంజు అస్రానీ. మా పూర్వీకులది గుజరాత్. తండ్రి వ్యాపారరీత్యా అక్కడ స్థిరపడ్డాం. పాఠశాల, కాలేజీ చదువంతా అక్కడే జరిగింది. తెలుగు, తమిళం మాట్లాడుతాను. ఇపుడు మలయాళం నేర్చుకుంటున్నా.

? తొలి అవకాశం ఎలా వచ్చింది

! పాఠశాలలో చదువుకునే సమయంలోనే బాలనటిగా ఒకటి రెండు చిత్రాల్లో నటించాను. ఆ అనుభవంతో డాక్యుమెంటరీల్లో నటించే అవకాశం వచ్చింది. అలా తెలుగు చిత్రాల్లో నటించే ఛాన్స్ లభించింది. తొలి తెలుగు చిత్రం 'ప్రెషర్ కుక్కర్'.

? తమిళంలో తొలి అవకాశం ఎలా లభించింది

! తెలుగు, తమిళ సీరియల్స్‌లో చిన్నచిన్న రోల్స్ చేశాను. 'మిన్నలే' అనే తమిళ సీరియల్ బ్రేక్ ఇచ్చింది. ఆ సమయంలోనే దర్శకుడు మూర్తి చూసి 'అయోధ్య'లో శశికుమార్ సరసన నటిస్తారా అని అడిగారు. మరోక్షణం ఆలోచన చేయకుండా ఓకే చెప్పేశాను.

? తొలి చిత్రంలోనే పెద్ద హీరోతో ఛాన్స్.. ఎలా ఫీలయ్యారు

! నిజం చెప్పాలంటే ఒక వైపు భయం. మరోవైపు పట్టరాని సంతోషం. కానీ, లొకేషన్‌లో శశికుమార్, దర్శకుడు మూర్తి సహకారం మరువలేనిది. సినిమా విడుదలైన తర్వాత తొలిరోజు సరైన స్పందన లేదు. మూడు రోజుల తర్వాత సూపర్ హిట్ టాక్ వచ్చింది. అపుడే పోయిన ప్రాణం వచ్చినట్టయింది.

? రజనీకాంత్ కితాబుపై మీరేమంటారు

! 'అయోధ్య' చిత్రాన్ని సూపర్‌స్టార్ రజనీకాంత్ చూసిన విషయం నాకు తెలియదు.ఆయన ఆహ్వానించి అభినందించారు. నేను నటించిన తొలి చిత్రంలోనే ఆయన అభినందనలు, మన్నలు పొందడం జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకం.

? మీ రోల్ మోడల్ ఎవర

! నా రోల్ మోడల్ మా అక్క అంజు అస్రానీ. 'అయోధ్య' చిత్రంలో నాకు అమ్మగా నటించారు. ఆమె తెలుగులో పలు హిట్ చిత్రాల్లో నటించారు. నిజ జీవితంలోనే కాదు వెండితెరపై కూడా అక్కాచెల్లెళ్లుగా పేరు గుర్తింపుపొందాం.

? తొలి చిత్రం షూటింగులో మరిచిపోలేని అనుభూతి

! 'అయోధ్య' చిత్రం షూటింగ్ మదురైలో నెల రోజుల పాటు జరిగింది. మీనాక్షి అమ్మవారిని దర్శనం చేసుకున్నాం. ఇపుడు మదురై వెళ్లే మొదట వెళ్ళేది ఆ ఆలయానికే. మదురై ప్రజల ప్రేమాభిమానులు అద్భుతం. షూటింగ్ స్పాట్‌లో కూడా వారు అమితమైన అభిమానం చూపించారు.

నయనతార బర్త్‌డే స్పెషల్
కొత్త చిత్రం పేరు 'రాక్కాయి'



'రాక్కాయి' ఫస్ట్‌లుక్

అగ్రనటి నయనతార నటించే కొత్త చిత్రం టైటిల్‌తో పాటు టీజర్‌ను ఆమె పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం మేకర్స్ వెల్లడించారు. 'రాక్కాయి' అనే పేరుతో రూపొందే ఈ చిత్రానికి సెంథిల్ నల్లస్వామి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్, మూవీ వెర్స్ స్టూడియో సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో నయనతారను గతంలో ఎన్నడూ చూడని లుక్‌లో కనిపిస్తున్నారు. నడుముకు కొంగు బిగించి, కర్రపట్టుకుని సమరానికి సిద్ధం అనేలా ఉన్న ఆమె లుక్ అభిమానుల్లో అమితాసక్తిని రేకెత్తిస్తుంది. ఇందులో బలమైన శక్తిని ప్రతిబింబించే పాత్రను పోషిస్తున్నట్టుగా తెలుస్తుంది. నయనతార ఎపుడూ కొత్తదనంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఆకట్టుకుంటుంటారు. వినూత్నమైన కథాంశంతో యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. స్వరకర్త గోవింద్ వసంత్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చుతున్నారు. అయితే, ఇందులో నటించే నటీనటుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

రూ.వంద కోట్ల క్లబ్‌లో 'కంగువా'

● ఈ యేడాదిలో తొమ్మిదో చిత్రం



తమిళ చిత్రపరిశ్రమలో ఈ యేడాదిలో ఇప్పటివరకు విడుదలైన చిత్రాల్లో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తొమ్మిదో చిత్రంగా సూర్య హీరోగా నటించిన 'కంగువా' చేరింది. విడుదలైన మూడు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ.127.64 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఈ యేడాదిలో ఇప్పటి వరకు 200 చిత్రాలు విడుదల కాగా, వాటిలో దాదాపుగా 20 చిత్రాలు మాత్రమే హిట్ జాబితాలో చేరాయి. ఇందులో ఇప్పటివరకు ఎనిమిది చిత్రాలు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరాయి. ఇపుడు తొమ్మిదో చిత్రంగా కంగువా ఆ లిస్టులో ఉంది. ఈ చిత్రాల్లో అత్యధికంగా విజయ్ నటించిన 'ది గోట్' ఏకంగా రూ.450 కోట్ల మేరకు వసూలు చేసింది. ఆ తర్వాత స్థానంలో శివకార్తికేయన్ నటించిన 'అమరన్' రూ.300 కోటు రాబట్టింది. మూడో స్థానంలో రజనీకాంత్ 'వేట్టయన్', కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రాలు రూ.250 కోట్ల మేర వసూలు చేశాయి. ధనుష్ నటించిన 'రాయన్', సుందర్ సి దర్శకత్వం వహించిన 'అరణ్మనై-4', విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ', విక్రమ్ నటించిన 'తంగలాన్' చిత్రాలు రూ.100 కోట్ల మేరకు వసూళ్ళను రాబట్టాయి. ఇపుడు సూర్య నటించిన 'కంగువా' ఆ జాబితాలో చేరిన తొమ్మిదో చిత్రంగా నిలిచింది. అలాగే, మరికొన్ని చిత్రాలు రూ.100 కోట్ల మేరకు కలెక్షన్లు రాబట్టలేకపోయినప్పటికీ సూపర్‌హిట్‌గా నిలిచాయి. అలాంటి వాటిలో సూరి 'గరుడన్', అరుల్‌నిధి 'డిమాంటి కాలనీ-2', హరీష్ కళ్యాణ్ 'లబ్బర్ పందు', జీవా నటించిన 'బ్లాక్' సినిమాలు కూడా భారీ కలెక్షన్లు సాధించాయి.

టెక్ కంపెనీలు భారత్‌లో ఆవిర్భవించాలి

● ఏఆర్ రెహ్మాన్



అవార్డు స్వీకరిస్తున్న రెహ్మాన్

మైక్రోసాఫ్ట్, యాపిల్, ఇంటెల్ వంటి టెక్ కంపెనీల తరహాలోనే భారత్‌లో టెక్ కంపెనీలు ఆవిర్భవించాలని ప్రముఖ సంగీత దర్శకుడు, అకాడెమీ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ ఆకాంక్షించారు. ఆయన స్వయంగా నిర్మించిన వర్చువల్ రియాలిటీ ఫిల్మ్ 'లే మస్క్'కి ఐఐటీ మద్రాస్ నుంచి అవార్డు అందుకున్నారు. వర్చువల్ రియాలిటీ (వీఆర్) చలనచిత్రంపై రెహ్మాన్ దూరదృష్టితో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ విజిటింగ్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ స్టీవెన్ లావల్లే, ప్రొఫెసర్ అన్నా లావల్లే చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థల్లో ఒకటైన ఐఐటీ మద్రాస్ ప్రకటించిన అవార్డును తన సొంతగడ్డ చెన్నైలో అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మైక్రోసాఫ్ట్, యాపిల్, ఇంటెల్ వంటి సంస్థలు భారత్‌లో ఎందుకు ఆవిర్భవించరాదు? అని అలోచన చేస్తాను. ఇలాంటి సంస్థలు ఉద్భవించేందుకు ప్రభుత్వాలు తమ వంతు సహకారం అందించాలి' అని కోరారు.

పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో కులశేఖరపట్టినం దసరా వేషాలు







చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలో ఈ యేడాది జరిగిన దసరా వేడుకల్లో గ్రామీణ కళాకారులు ధరించిన వేషాల ఫొటోలు, వీడియోలు చోటుచేసుకున్నాయి. ఇదే విధంగా ప్రైవేటు వెబ్‌సైట్‌లలోనూ ఈ ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. రాష్ట్రంలో దసరా అంటే అందరికీ కులశేఖరపట్టినమే గుర్తుకు వస్తుంది. మైసూరు తర్వాత అత్యంత భారీ స్థాయిలో దసరావేడుకలు కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయం వద్దే జరుగుతాయి. తిరుచెందూరు నుంచి కన్నియాకుమారికి వెళ్లే మార్గంలో 11. కి.మీ.ల దూరంలో సముద్రతీరానికి చేరువగా కులశేఖరపట్టినం ఉంది. ఆ గ్రామంలోని ముత్తారమ్మన్ ఆలయంలో ప్రతియేటా దసరా వేడుకలు ఘనంగా జరుగుతాయి. సముద్రతీరం వద్ద మహిషాసురుడిని ముత్తారమ్మన్ సంహరించే ఘటాన్ని తిరుచెందూరు శూరసంహారం రీతిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. దసరా సందర్భంగా గ్రామీణ కళాకారులు, మొక్కుబడులు చెల్లించుకునే రీతిలో భక్తులు చిత్రవిచిత్రమైన వేషాలు ధరిస్తారు. ఈ యేడాది కూడా అక్టోబర్‌లో దసరా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆ సందర్భంగా గ్రామీణ కళాకారులు వేసిన వేషాలు, ఆ కళాకారుల నృత్యాల వీడియోలు ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో దర్శనమిస్తున్నాయి.

పది నిమిషాల్లో 1000 రకాల ఆమ్లెట్లు

● 'ఐన్‌స్టీన్ వరల్డ్ రికార్డ్'లో చెన్నై విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'చెన్నైస్ అమృత ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్' సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం పది నిముషాల్లోనే 1000 రకాల ఆమ్లెట్లను సిద్ధం చేసి 'ఐన్‌స్టీన్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. ఇటీవల చెంగల్పట్టులో జరిగిన ఈ కార్యక్రమంలో 500 మంది పాకశాస్త్ర విద్యార్థులు పాల్గొని తమ అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఐన్‌స్టీన్ సంస్థ నిర్వాహకులు కార్తీక్ కుమార్ ఈ మేరకు వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను నిర్వాహకులకు అందజేశారు. కాగా చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ ఎస్.అరుణ్‌రాజ్, చెన్నై అమృత సంస్థ చైర్మన్ ఆర్.భూమినాథన్ తదితరులు ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

క్యారమ్స్ వరల్డ్ కప్ విజేత కసిమాకు సీఎం ప్రశంస



ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో కసిమా (ఫైల్‌ఫొటో), పోటీలో గెలుచుకున్న స్వర్ణపతకాలను చూపుతున్న కసిమా

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన ఆరవ క్యారమ్స్ వరల్డ్ కప్ పోటీల్లో మూడు స్వర్ణపతకాలు గెలుచుకున్న చెన్నై క్రీడాకారిణి కసిమాపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ పోటీల్లో రాష్ట్రానికి చెందిన క్యారమ్ క్రీడాకారులు కసిమా, నాగజోతి, మిత్రా, మరియ ఇరుదయం భారతదేశం తరపున పాల్గొన్నారు. ఈ పోటీల్లో చెన్నై న్యూవాషర్‌మెన్ పేట చెరియన్ నగర్‌కు చెందిన క్రీడాకారిణి కసిమా మహిళల విభాగం, డబుల్స్‌లో, గ్రూప్ పోటీల్లో వరుసగా స్వర్ణ పతకాలు గెలుచుకుని విజేతగా నిలిచింది. ప్రస్తుతం ఆ పోటీలు ముగియడంతో కసిమా ఈ నెల 21న అమెరికా నుంచి బయలుదేరి నగరానికి చేరనుంది. ఈ పోటీలకు సిద్ధమవుతున్న సందర్భంగా గత జూలై 11న కసిమా క్రీడామంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని కలుసుకుంది. ఆ సందర్భంగా కసిమాతోపాటు రాష్ట్రం నుండి ఈ పోటీలకు వెళ్లే క్రీడాకారిణులకు రూ.1.5లక్షల ఆర్థిక సాయాన్ని ఆయన అందించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ స్థాయి క్యారమ్ పోటీల్లో మూడు స్వర్ణ పతకాలను గెలుచుకున్న కసిమాను స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఓ ప్రకటనలో అభినందించారు.

మంచుదుప్పటిలో ఏర్కాడు

● చలికి వణకుతున్న పర్యాటకులు



ఏర్కాడు ప్రధాన రహదారిని కప్పేసిన మంచు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో 'పేదల ఊటీ'గా పేరొందిన ఏర్కాడు అంతటా మంచు కురుస్తుండటంతో పర్యాటక ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. కనివినీ ఎరుగని రీతిలో చలిగాలులు వీస్తుండటంతో స్థానికులు, పర్యాటకులు చలికి వణకిపోతున్నారు. వారం రోజులుగా ఏర్కాడు, పరిసర ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు, మళ్ళీ అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు జల్లులు కురిశాయి. దీంతో ఏర్కాడులోని పర్యాటక ప్రాంతాల్లో దట్టమైన మంచు ఆవరించింది. మంచు కారణంగా చలి అధికం కావటంతో స్థానికులు, కార్మికులు గిజగిజ వణకుతున్నారు. ఏర్కాడు ఘాట్‌రోడ్డులోను మంచు వర్షం కురుస్తుండటంతో అన్ని వాహనాలు హెడ్‌లైట్లు వేసుకుని వాహన చోదకులు నడుపుతున్నారు.ఓవైపు మంచు, మరోవైపు చలి అధికం కావటంతో గత రెండు రోజులుగా ఏర్కాడుకు వచ్చే పర్యాటకుల సంఖ్య బాగా తగ్గిపోయింది.

ప్రపంచ తెలుగు సదస్సుకు యజ్ఞశేఖర్



చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖతార్ రాజధాని దోహా నగరంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరుగనున్న 9వ ప్రపంచ తెలుగు సదస్సుకు మద్రాస్ క్రైస్తవ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ శ్రీపురం యజ్ఞశేఖర్‌కు ఆహ్వానం అందింది. ఆంధ్ర కళావేదిక, ఖతార్, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తమిళనాడు నుంచి సదస్సులో పాల్గొంటున్న ఏకైక తెలుగు అచార్యులు శ్రీపురం యజ్ఞశేఖర్ కావడం విశేషం. 'గురజాడ-మానవతావాదం' అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.



ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు వా.వు. చిదంబరనార్ 88వ వర్ధంతి సందర్భంగా గిండి గాంధీ మండపంలోని ఆయన విగ్రహం, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్ బాబు, మేయర్ ప్రియ తదితరులు

భారతీయ సంస్థలతో దృఢమైన భాగస్వామ్యం

● యూఈఎల్ వీసీ అమండా



సదస్సులో విద్యావేత్తలు

చెన్నై, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్థలతో దృఢమైన భాగస్వామ్యం పెంపొందించుకోవడం ద్వారా ఇరుదేశాల మధ్య బంధం మరింత బలోపేతమవుతుందని 'యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్' (యూఈఎల్) వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ అమండా జె.బ్రోడెరిక్ పేర్కొన్నారు. యూఈఎల్ నగరంలోని ఓ హోటల్లో సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు భారత్‌కు చెందిన పలు సంస్థల ప్రతినిధులు హాజరయ్యాయి. ఈ సందర్భంగా అమండా మాట్లాడుతూ.. భారత్ కీలకమైన మార్కెట్ అని, తమ పర్యటన బలమైన భాగస్వామ్యాలను పెంపొందించడానికి, స్థిరమైన ఆవిష్కరణలను నడపడంలో తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే అణు నిరోధక కవచ వ్యవస్థ

● సిగ్మా లైన్ సీఎండీ డాక్టర్ మిక్కిలి ప్రసన్న కుమార్



యాంటీ న్యూక్లియర్ షీల్డ్ ప్రారంభోత్సవంలో డాక్టర్ మిక్కిలి ప్రసన్నకుమార్, అబ్రహాం లింకన్ తదితరులు

ప్యారీస్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ రీసెర్చ్ కేంద్రం శాస్త్రవేత్తల సహకారంలో సమాజ శ్రేయస్సు కోసం తమ సంస్థ రూపొందించిన వినూత్న అణు నిరోధక కవచ వ్యవస్థ విజయవంతమైందని హైదరాబాద్‌కు చెందిన సిగ్మా9 ఏరోస్పేస్ డిఫెన్స్ రీసెర్చ్ సెంటర్ సీఎండీ డాక్టర్ మిక్కిలి ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. ఎగ్మోర్‌లోని నక్షత్ర హోటల్‌లో ఆదివారం రాత్రి 'గ్రౌండ్ బ్రేకింగ్ యాంటీ న్యూక్లియర్ షీల్డ్' ప్రారంభోత్సవం దేశంలోని పలువురు అణు శాస్త్రవేత్తలు, నిపుణుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, మహిళా సాధికారతతో తమ సంస్థ యాంటీ న్యూక్లియర్ షీల్డ్ టెక్నాలజీలో అద్భుతమైన పురోగతి సాధించిందని, ఇది 15 యేళ్ళ కృషికి దక్కిన ఫలితమన్నారు. దేశ భద్రతపై ప్రత్యేక దృష్టిసారించామని, ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రమాదాల నుంచి సమస్త జీవులను రక్షించే లక్ష్యంతో అధునాతన సెన్సార్లు, యాంటీ క్షిపణి గోడలను మిళితం చేస్తుందని వివరించారు. ముఖ్యంగా శత్రుదేశాల అణుదాడులను తట్టుకోగల దృఢమైన రక్షణాత్మక మౌలిక సదుపాయాలు సృష్టించడం ద్వారా పౌరులను రక్షించాలన్న లక్ష్యంతో అణుశాస్త్ర విశేష అనుభవం కలిగిన శాస్త్రవేత్తల సహకారంతో తాము ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లిబాబు, శ్రీరామచంద్రమూర్తి, సుభాష్ చంద్రబోస్, ముద్దా అబ్రహాం లింకన్, ఇందిరా, కీర్తి, రాధ, రాజేశ్వరి, కంచన్, తులసి, రమణి, శ్వేత, నవనీత, వాణి, చరిత సౌఖ్య, జీసీసీ రెవెన్యూ అధికారి ఎంపీ తిరుపాల్, డాక్టర్ చల్లగాలి యాకోబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశానికి రక్షణ కవచం రూపొందించిన ప్రసన్న కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

చెంగల్పట్టు క్రీడాకారుడికి సింగ్ గంబిట్ చెస్ టోర్నీ టైటిల్



'సింగ్ గంబిట్' విజేతలతో నిర్వాహకులు

అడయార్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని గురునానక్ కాలేజీలో జరిగిన సింగ్ గంబిట్ ఇంటర్నేషనల్ ఫైడ్ రేటెడ్ చెస్ టోర్నమెంట్ 2024 టైటిల్‌ను చెంగల్పట్టు జిల్లాకు చెందిన అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు ఏఆర్.ఇళంపరిధి కైవసం చేసుకున్నాడు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన పోటీల్లో రెండు, ఐదు స్థానాల విజేతలను ఐసీఎఫ్‌కు చెందిన ఆర్.బాలసుబ్రమణియన్, సి.ప్రవీణ్ కుమార్, ఆర్.ఆర్.లక్ష్మణ్, ఏజీఎం విఘ్నేష్‌లో ఇద్దరిని టైబ్రేక్‌లో విజేతలుగా ఎంపికచేశారు. టైటిల్ విజేతగా నిలిచిన ఇళంపరిధికి ట్రోఫీతో పాటు రూ.లక్ష బహుమతి ప్రదానం చేయగా, రన్నరప్‌గా నిలిచిన బాలసుబ్రమణియన్‌కు రూ.75 వేలు, మూడో స్థానంలో నిలిచిన ప్రవీణ్ కుమార్‌కు రూ.60 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన లక్ష్మణ్‌కు రూ.50 వేలు, ఐదో స్థానంలో నిలిచిన ఏజీఎం విఘ్నేష్‌కు రూ.40 వేలు చొప్పున నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురునానక్ కాలేజీ కరస్పాండెంట్ మంజిన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శైవాలయాల్లో 'కార్తీక' సందడి



శ్రీకాళహస్తిలోని భరద్వాజతీర్థంలో కార్తీక దీపాల వెలుగులు.. దీపం వెలిగిస్తున్న ఈవో బాపిరెడ్డి

కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం దీపాలు వెలిగించారు.





కపిలతీర్థంలో భక్తుల సందడి





నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం

పాపం.. పురుషుడు!

పెరుగుతున్న బలవన్మరణాలు



"అమ్మ తొమ్మిది నెలలు మోస్తే
నాన్న పాతికేళ్లు.. రెండూ సమానమే అయినా
నాన్న ఎందుకో వెనుకబడ్డాడు. ఇంట్లో జీతం
తీసుకోకుండా అమ్మ..తన జీతమంతా
ఇంటికే ఖర్చుపెట్టే నాన్న ..
ఇద్దరి శ్రమ సమానమే అయినా
నాన్న ఎందుకో వెనుకబడ్డాడు.."


ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయిన కవిత ఇది. చిన జీయర్ స్వామి సమక్షంలో రచయిత, సినీనటుడు ఈ కవిత చదువుతూ భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేకపోయారు. అందరూ అమ్మ గురించో లేదా మహిళల కష్టం గురించో మాట్లాడుతారు. బండెడు సంసార భారం మోస్తూ ఏనాడూ తన ఆరోగ్యం గురించి పట్టించుకోని నాన్నను విస్మరిస్తారు. కారణం అతడు పురుషుడు. సంసారనావ ఈదుతూ ఎదురయ్యే ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లను మగవాళ్లు నిశ్శబ్దంగా భరిస్తున్నారు. ఒక్కోసారి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడుతుంటారు. సామాజిక, కుటుంబ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యలను పరిష్కారాలుగా ఎంచుకుంటున్నారని జిల్లా గణాంకాలు చెబుతున్నాయి.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

"పురుషుల మానసికారోగ్యం, ప్రాముఖ్యత గురించి చర్చ జరగాలనే ఆలోచనతో 'పాజిటివ్ మేల్ రోల్ మోడల్స్' అనే నినాదంతో నవంబరు 19ని ప్రపంచ పురుషుల దినోత్సవంగా గుర్తిస్తున్నారు. "

తిరుపతి జిల్లాలో పురుషుల ఆత్మహత్యల సంఖ్య మహిళలకంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రతి 10 ఆత్మహత్యల్లో ఏడు లేదా ఎనిమిది మంది పురుషులే ఉన్నారు. గతేడాది 339 మంది ఆత్మహత్యలకు పాల్పడితే వారిలో 272 మంది పురుషులు ఉన్నారు. ఈఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకూ గణాంకాలు పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్న వారిలో మగవాళ్లు మహిళల కన్నా మూడు రెట్లు ఎక్కువ ఉన్నారు. గడిచిన 10 నెలల్లో 365 మంది ఆత్మహత్య చేసుకుంటే వీరిలో 283 మంది పురుషులే. ఆత్మహత్యకు భిన్నా కారణాలున్నా, ఒత్తిడికి గురవడం ప్రధానమని మానసిన వైద్య నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల కూడా కొందరు విషాదాంతమవుతున్నారు. ఒత్తిళ్ల తీవ్రత వల్లనే చాలామంది పురుషులు బీపీ, షుగర్‌ల బారిన పడుతున్నారు.

మద్యానికి బానిసలై



జిల్లాలో పది లక్షలమందికి పైగా పురుషులు ఉన్నారు. వీరిలో ప్రతి పదిమందిలో నలుగురు ఆల్కహాలును ఆశ్రయిసున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇందుకు కారణం ఒత్తిడి అని వీరు చెబుతుంటారు. జిల్లాలో నాలుగు డీ-అడిక్షన్ సెంటర్లు ఉన్నారు. ఇందులో ఒకటి రుయా ఆస్పత్రిలో నడుస్తోంది. మూడేళ్ల క్రితం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో లక్ష్మీపురం వద్ద మరొకటి ఏర్పాటైంది. రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒకటి, పాపానాయుడు పేటలో మరొక డీ ఆడిక్షన్ సెంటర్ నడుస్తోంది. ఇక్కడ మద్యానికి బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

పురుషులే ఎందుకు?



శారీరకంగా పురుషుడు, స్త్రీకన్నా బలం కలిగినవాడు అనే వాదన వినిపిస్తుంటుంది. కార్మికుల వేతనాల్లోనూ ఈ తేడా చూపిస్తుంటారు. పిల్లల్ని కనే శక్తి ఉన్న స్త్రీలు సహజంగానే శారీరకంగా బలహీనం కావచ్చు గానీ, మానసికంగా మాత్రం పురుషులకన్నా బలమైనవారు. కుటుంబ, ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొనే స్థైర్యం మహిళల్లోనే ఎక్కువ. పిల్లలు, కుటుంబం అనే బాధ్యత కూడా వీరికి పోరాడే తెగువను ఇస్తుంది. మగవాళ్లు చావును ఎంచుకుని తేలిగ్గా ఈ బాధ్యత నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తారు. అందుకే అనారోగ్యంతోనే, అప్పులతోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ పురుషుల గురించే ఎక్కువగా వింటుంటాం.

పురుషులు బయటకు చెప్పుకోలేరు



రకరకాల ఒత్తిళ్ల వల్ల పురుషులు మానసికంగా అంతకంతకూ బలహీనులవుతున్నారు. అందుకే మహిళల కన్నా పురుషుల్లోనే ఆత్మహత్యలు మూడు రెట్లు ఎక్కువ కనిపిస్తున్నాయి. మానసిక బలహీనతలతో పాటు బీపీ, డయాబెటిస్, గుండె జబ్బులు తదితర ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. పురుషులు ఒత్తిడిని బయటకు చెప్పుకోలేరు. మనసులోనే దాచుకుని నలిగిపోతుంటారు. ఆడవాళ్లతో పోలిస్తే మగాళ్లకే గుండెపోటు ఎక్కువగా వస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ఇండియన్ హార్ట్ సొసైటీ ప్రకారం..గుండెపోటు వచ్చిన 50 శాతం మగాళ్లలో 50 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లే ఉన్నారు. విదేశీయులతో పోల్చితే మన దేశంలో ఉన్న మగాళ్లే రెండు రెట్లు ఎక్కువగా గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతున్నారు.

- అనుపమ, క్లినికల్ సైకాలజిస్టు

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 168 వినతులు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 168 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 109 ఉన్నాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

పింఛను కోసం 8 నెలలుగా తిరుగుతున్నా..



'కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. షుగర్ వ్యాధితో రెండు కాళ్లు తొలగించారు. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నా. పింఛను కోసం ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా పట్టించుకోండి' అంటూ రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన శంకరయ్య అధికారులకు విన్నవించారు.

నిమ్మచెట్లు నరికేశారు



అయ్యా నేను, నా భార్య దివ్యాంగులం. నాకు బాలయ్యపల్లి మండలం అష్టకావేరి గ్రామంలో ఎకరా భూమి ఉంది. 25ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. గ్రామానికి చెందిన వీరయ్య నా పొలాన్ని నాలుగు నెలల క్రితం ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే పొలంలో ఉన్న నిమ్మచెట్లను సదరు వ్యక్తులు నరికేశారు. న్యాయం చేయాలని వెంకటరమణయ్య అధికారులకు విన్నవించారు.

నష్ట పరిహారం ఇవ్వండి

గాలేరు - నగరి సుజల స్రవంతి పథకం కోసం ఏర్పేడు వద్ద ఉన్న మా భూమిని అధికారులు తీసుకున్నారు. పరిహారం కోసం మూడేళ్లుగా జీఎన్ఎస్ఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చెల్లించడంలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అదే పరిస్థితి. న్యాయం చేయాలని తిరుపతికి చెందిన మొబీనాబేగం అధికారులకు విన్నవించారు.

జీవో అమలు చేయాలని ఆందోళన

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో కుదుర్చుకున్న జీవోను తక్షణం అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై చర్చలు జరిపి జీవో విడుదలై తొమ్మిది నెలలు కావస్తున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శిలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఉద్యోగ విరమణ చెందిన వారికి బెనిఫిట్ స్కీమ్ కింద తక్షణమే రూ.60వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



వేతనం పెంచాలని ధర్నా



కనీస వేతనాలు పెంచాలని కోరుతూ సివిల్ సప్లైస్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సంఘీభావం ప్రకటించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. ప్రతినెలా ఐదో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నగర కార్యదర్శి రవి, హమాలీ యూనియన్ నాయకులు చెంచయ్య, శీను, పాండు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం





ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం - ప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని బియ్యం లారీ ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని వీఎంపల్లి వద్ద నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. వెంకటగిరి మండలం చిన్నపరెడ్డిపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి(37) ఎరువుల కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఎరువుల దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ కార్యకలాపాలు ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. కాసాగార్డెన్ వద్ద సర్వీసు రోడ్డు నుంచి వెంకటగిరికి బయలుదేరాడు. వీఎంపల్లి వద్ద జాతీయ రహదారి మెయిన్‌రోడ్డులోకి ప్రవేశించే క్రమంలో నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న బియ్యంలోడ్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా 90 రోజుల సుదీర్ఘకాలం ప్రసాద్‌రెడ్డి అయ్యప్పదీక్షలో ఉన్నాడు.

రేణిగుంటలో నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లు, రెండు మెడికల్ షాపుల సీజ్



సాయినారాయణ ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లను, రెండు మెడికల్ షాపులను జిల్లా వైద్యాధికారి శ్రీహరి సీజ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని వీబీఆర్ నర్సింగ్ కళాశాలలో కలుషిత ఆహారం తిని ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారిని జిల్లా వైద్యాధికారి శ్రీహరి పరీక్షించారు. ఈ సందర్భంగా వీబీఆర్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రేణిగుంట పట్టణంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై ఫిర్యాదు రావడంతో ఆయన వాటని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సాయి నారాయణ, కార్తికేయ, శ్రీపద్మావతి వెంకటేశ్వర, రూప క్లినిక్‌లను, సాయి నారాయణ, శ్రీపద్మావతి వెంకటేశ్వర క్లినిక్‌లకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్‌లను సీజ్ చేశారు. మండలంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేయాలని వైద్యాధికారి చత్ర ప్రకాష్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు.

జగన్‌పై అసభ్యకరపోస్టులు పెట్టారు

● తిరుపతి పోలీసులకు భూమన, రోజా, నారాయణస్వామి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతూ తమ నాయకుడు వైఎస్ జగన్‌పై అసభ్యరక పోస్టులు పెడుతున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి రోజా, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరసింహులు ఫిర్యాదును పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారికి చెప్పారు. వైసీపీ నాయకులు కోరినట్లుగా ఫిర్యాదుకు రసీదు ఇచ్చారు. వైసీపీని భ్రష్టు పట్టించాలనే ఆలోచనతోనే తప్పుడు పోస్టులు పెడుతున్నారని భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతీసేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



తిరుపతి ఈస్ట్ ఎస్ఐకి పిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

పోలీసులపై ప్రివిలేజ్ మోషన్: ఎంపీ

ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవడానికి పోలీసులు ఆసక్తి చూపలేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. దాదాపు 40 నిమిషాల పాటు పట్టించుకోలేదన్నారు. ప్రొటోకాల్ పాటించని పోలీసులపై ప్రివిలేజ్‌మోషన్ మూవ్ చేయాల్సి వుంటుందని హెచ్చరించారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

● జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి



సమావేశంలో పాల్గొన్న జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులతో ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యావంతులు మహిళల భద్రత పట్ల శ్రద్ధ చూపాలని, మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి స్పష్టం చేశారు. తిరుపతి ఐఐటీలో నీతి బోధ్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీం సహకారంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ మాట్లాడుతూ... సమాజాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళల భద్రత పెంపొందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఇలాంటి కీలకమైన కార్యక్రమాన్ని నిర్వహించడంలో నీతిబోధ్ క్లబ్, ఎన్ఎస్ఎస్ టీంల సమష్టి కృషి ఉందన్నారు. మహిళల హక్కులు, ఆహార భద్రత, పౌష్టికాహారంపై విజయభారతి సయాని పలు సూచనలు చేశారు. మహిళల శ్రేయస్సు, సాధికారతకు ఆచరించాల్సిన విధి విధానాలపై ప్రసంగించారు. ఐఐటీలో విశిష్ట ఉపన్యాస కార్యక్రమం సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా నిర్వహించడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులకు ఐఐటీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

పేర్నాడు రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పులికాట్ సరస్సులో పర్యావరణం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో సూళ్లూరుపేట మండలం పేర్నాడు రోడ్డుకు అటవీ అనుమతులు ఇవ్వడం లేదని ప్రభుత్వం కల్పించుకొని అనుమతులు ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో వేనాడు-పేర్నాడు రోడ్డు సమస్యను ఆమె ప్రస్తావించారు. మూడు పంచాయతీల పరిధిలో 18 గ్రామాలు ఉన్నాయని సుమారు 5వేల మంది ఆయా గ్రామాల్లో జీవిస్తున్నార న్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు సరైన రోడ్డు వసతిని ఆ గ్రామాల్లో ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. సరస్సు కోసం వచ్చే వలస పక్షులు ఎంత ముఖ్యమో ఆయా గ్రామాల ప్రజలు కూడా అంతే ముఖ్యమని తెలియజేశారు. ఆ మేరకు ఆ రోడ్డు ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్న అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు.

ఎర్రచందనం వాహన డ్రైవరు అరెస్టు

● టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్ పోస్టు వద్ద పది నెలల కిందట టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు.. ఎర్రచందనం స్మగ్లింగ్ వాహన డ్రైవర్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. చింతలపాలెం చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 23న తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు వాహనాలను తనిఖీ తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఎర్రచందనం తీసుకుని వస్తున్న కారును కానిస్టేబుళ్లు ఆపారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన వసంత్ ఎర్రచందనం వాహనం ఆపకుండా వేగంగా వచ్చి కానిస్టేబుల్ ప్రభాకరరావును ఢీకొట్టి పరారయ్యాడు. దీనిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన వసంత్ కోసం గాలించిన పోలీసులు.. సోమవారం అరెస్టు చేశారు. అతడిని విచారించి ఈ కేసులో ప్రధాన స్మగ్లర్ ఎవరనే విషయాలు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఏర్పేడు సీఐ జయచంద్ర చెప్పారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయానికి ముందే ఆలయం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రెండవ గేటు సమీపంలో భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా విశేషంగా దీపారాధన సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. రూ.50 శీఘ్ర దర్శనం 3,328, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,102 కలిపి మొత్తం 6,430 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులుపేర్కొన్నారు. మొత్తంగా 35వేలమంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.